పుష్పాంజలి

1

సమ్యక్సంబుద్ధ గౌతమ బుద్ధదేవుడు రాజగృహ నగర సింహద్వారం దాటి పట్టణంలో ప్రవేశించినాడన్న వార్త చెవుల బడగానే పౌరు లందరూ తండోప తండాలుగా పుర సింహద్వారం వైపు సాగిపోయారు. శారీపుత్ర మౌద్గల్యాయనులు, ఇంకా ఇతర భిక్షుకులూ నెమ్మది నెమ్మదిగా అడుగులు వేసుకుంటూ నిశ్శబ్దంగా బుద్ధదేవుని వెను వెంటనే వెళ్ళి పోయారు.

రాజగృహ పురప్రాసాదాలలోను, రాజ వీధులలోను, సామాన్య రథ్యలలోను ఎక్కడ చూచినా ఇసక వేసినా రాలని జన సందోహాలే! పౌరుల నేకులు పిల్లలతోను, పాపలతోను తరలి వచ్చి, బుద్ధదేవుని సందర్శనం కోసం బాటల పక్కనే పడిగాపులు పడి నిలుచున్నారు. వారంతా తమ తమ దైనందిన సాంసారిక దుఃఖాలన్నీ విస్మరించి, ఆ దివ్యమూర్తి సందర్శనం కోసం అనుక్షణం తహతహలాడి పోతున్నారు.

అప్పుడప్పుడే అరుణోదయం అయింది. నగరంలోని సంపన్న గృహస్థు లనేకులు తథాగతుడు సాగివచ్చే మార్గాలలో ముత్యాల రంగ వల్లులు దిద్దితీర్చి, భక్తి వినమ్ర ముఖాలతో అనుక్షణమూ బుద్ధభగవానుని రాక కోసం ఎదురు తెన్నులు చూస్తున్నారు.

అరుణోదయ కాంతులు ప్రసరించిన ముత్యాల రంగవల్లులన్నీ పద్మరాగ రంగవల్లికలవలె మెరిసిపోతూ బుద్ధమూర్తి పాద పద్మాలకు హారతులెత్తడం కోసం ఎదురు చూస్తున్నట్లుగా స్ఫురించాయి.

ఇంటి గుమ్మం ముందు నిలిచి తోటమాలి చేసిన ఘనకార్యం అంతా కనిపెట్టి చూస్తున్న అతని భార్య భర్త గుమ్మంలో అడుగు పెట్ట గానే అతని మీద అమాంతం విరుచుకు పడింది.

"ఎంత పని చేశా వీ వేళ! చక్రవర్తి ఇక నీ ప్రాణాలు దక్క నిస్తారా? ఎవరో మహారాజులు జరిపించవలసిన పూజలు, పునస్కారాలు మనకెందుకయ్యా! ఇంక మల్లెతీగలలో ఒక్క మొగ్గయినా మిగల లేదుకదా? మరి మన గతేం కావాలి!" అని వలవలా వాపోయింది. అంతలోనే చక్రవర్తి పరిచారకు డక్కడికి వచ్చి చక్రవర్తికి సమర్పించే మల్లెపూ లింకా రాలేదేమని గద్దించి అడిగాడు.

ఆ ప్రశ్నతో తోటమాలి భార్య చాలా భయపడింది. తన సంతానం అందరినీ వెంటబెట్టుకుని వెళ్ళి చక్రవర్తి సన్నిధికి పోయింది.

మొట్టమొదటగా ఆమెకు చక్రవర్తి దర్శనం లభించలేదు. పరి చారకు లెవరూ ఆమెను లోపలికి పోనీయలేదు. కాని, ఆమె వలవలా ఏడుస్తూ అక్కడే కూర్చుండిపోయింది. పిల్లలంతా ఆమె పరిస్థితి చూచి, బెంబేలు పడిపోయి అదే పనిగా గోలపెట్టడం మొదలు పెట్టారు! కొంత సేపటికా రోదన ధ్వనులన్నీ చక్రవర్తి శయనాగారందాకా వెళ్లి పోయాయి. ఆయన కిక ఆమెకు దర్శన మివ్వక తప్పలేదు.

చక్రవర్తి దర్శనం దొరకగానే తోట మాలిభార్య తన విషాద గాథ అంతా ఆయన కీవిధంగా తెలియజేసింది: "మహాప్రభూ! నా భర్త వట్టి అమాయకుడు, చాదస్తుడు; తన పూల మొక్కలూ, పూలూ తప్ప మరి వేరే ప్రపంచం ఏమీ ఎరగడు! జనం అంతా కేకలు వేసుకుంటూ ఆ సన్యాసి మహారాజా వెంటబడేసరికి మీ కోసం కోసిన పూవులన్నీ తీసుకుపోయి ఆయన పాదాల మీద గుమ్మరించాడు. చక్రవర్తి కివ్వవల సిన పువ్వులు సన్యాసికిస్తే మన ప్రాణా లెగిరిపోతాయనీ, ఆ పువ్వు లలా పారబొయ్యవద్దనీ నేను కేకలు పెడుతూనే ఉన్నాను. అయితే, ఆ వెర్రి బాగులవాడు నా మాటలు వినిపించుకుంటేనా? ఆ కోసిన పువ్వులు కానినీ ఆ సన్యాసిమహారాజా పాదాల మీద దిమ్మరించి వచ్చాడు. నే నేం చెయ్యను బాబూ!"

చక్రవర్తి కీ గాథ వినేసరికి కొంచెం నవ్వే వచ్చింది! అయినా బింబిసారు డది పైకి వ్యక్తం కానీయలేదు. కొంచెం రుసరుసలాడుతూ ఆమెతో ఇలా అన్నాడు:

"ఆఁ! తోటమాలి కంతటి పొగరా? చక్రవర్తి కీయవలసిన పుష్పాలు సన్యాసి పాదాల మీద గుమ్మరిస్తాడా? వాడి సంగతి నేను కనుక్కుంటానులే! సరే, నీకూ, నీ పిల్లలకూ భయమేమీ లేదులే! ఇంటికి వెళ్లిపో!"

ఆ మాటలు వినేసరికి ఆమెకు కొంత ఊరట కలిగింది గాని తన భర్త కేదో కీడు మూడనున్నదని భయపడింది. తిరిగీ చక్రవర్తి కెదురుగా వెళ్లి మోకరిల్లి, "నా భర్త ఏమీ ఎరగని వట్టి వెర్రిబాగులవాడు బాబూ! ప్రభువుల వారేలాగైనా కటాక్షించి రక్షించాలి!" అని విన్నవించి తొందర తొందరగా ఇంటికి వెళ్ళిపోయింది. చక్రవర్తి సన్నిధికి వెళ్లి ప్రాణభిక్ష పెట్టవలసిందని బ్రతిమాలుకొమ్మని తోటమాలితో చెప్పింది.

తోటమాలి చక్రవర్తికీ, ఆమెకూ మధ్య నడచిన సంభాషణ అంతా విన్నాడు. ఇక చక్రవర్తి సన్నిధికి వెళ్లడంవల్ల లాభంలేదని నిశ్చయించుకొన్నాడు. ధైర్యంగా ఇలా అన్నాడు: "నేనన్నిటికీ తెగించే ఆ మహారాజుకు పాదపూజ చేసుకున్నాను. నా పూజలంగుకుని ఆ మహానుభావుడెంతో ఆనందించారు! ప్రజలంతా బాగుబాగని హర్షించి తలలూచారు! నా కదే పదివేలు! ఇక ఈ పాడుబ్రతుకే పైపోతే నాకేమి?"

అని నిర్లక్ష్యంగా అడుగులు వేసుకుంటూ అక్కడినుంచి వెళ్ళిపోయాడు. "అయ్యో! నా ఏబ్రాసిమగడా! నిజంగానే నీకు మతి పోయిందయ్యా!" అని అతని భార్య ఆదేపనిగా వాపోయింది.

3

ఆ నాటి సాయంకాలం బింబిసార చక్రవర్తి రాజభవనానికి విచ్చేసి తన ఆతిథ్యం స్వీకరించవలసిందని సవినయంగా బుద్ధదేవునికి విన్నవించాడు. కాని, కరుణామూర్తి గౌతమ బుద్ధుడు దాని కంగీకరించలేదు. రాజభవనంలో పౌరు లెవ్వరికీ తన దర్శనం లభించదనీ, అందువలన వారం

దరికీ అందుబాటులో ఉండే విశాల ప్రదేశంలో ఆతిథ్య సన్నాహాలు చేయించవలసిందనీ ఆదేశించాడు. బింబిసార చక్రవర్తి ఆ ఆదేశం శిరసా వహించాడు. తథాగతుడు భిక్షు భిక్షుకీ గణాలతో కలిసి రాజగృహ నగర పుష్పోద్యాన వనానికి విచ్చేశాడు. ఆనాడు రాజగృహ పౌరు లందరూ కోలాహలంగా ఆ పుష్పోద్యానవనంలో గుమిగూడారు. పుష్పో ద్యాన వనంలో చల్లగాలికి కదలాడే పూల చెట్లన్నీ అపార కారుణ్యనిధి యైన గౌతమదేవునిపై పూలవానల జల్లులు కురిపించాయి. ఉద్యాన వనంలో నెమళ్లన్నీ పురి విప్పి నృత్యం చేశాయి. ఆనాడు పౌరులందరూ చేతులు జోడించి సమ్యక్సంబుద్ధ శాక్యసింహానికి జేజే లర్పించి ధన్యులై నారు. ఉద్యానవనం అంతా ఆ సంజె వెలుగులో అప్పుడే కొత్తగా చిగిర్చినట్లుగా మెరిసిపోయింది!

కాని, తోటమాలి భార్యమాత్రం ఒక చెట్టుక్రింద నిలబడి బుద్ధ దేవుని పాదాలు మనసారా సంస్మరించుకొని తనలో తానే గొణుగు కొంటున్నది. తన భర్త ఏమీ యెరుగని వట్టి వెర్రిబాగుల వాడనీ, ఆత నికి విధింపబోయే దారుణ మరణశిక్ష తప్పించవలసిందనీ పరిపరి విధా లుగా బుద్ధభగవానుని ప్రార్థించింది. అప్పుడప్పుడు నిశ్చలంగా జన సందోహంవైపు తిలకిస్తున్న బుద్ధదేవుని కృపావిశాల నేత్రాల వైపు చూచింది. ఆమె కవి తన వైపే తిలకిస్తున్నట్లుగా స్ఫురించాయి. ఆమె తన సంతానానికి రాబోయే దైన్యస్థితి తలుచుకొని తిరిగీ కన్నీరు పెట్టు కొన్నది. ఆ కృపామూర్తి తన ప్రార్థన వినకపోడని అనుకొని కొంచెం ధైర్యం పొందింది. ఆయనకు తమవంటివారి కోరికలు తెలియకపోతాయా! అని కొంచెం ఊరట చెందింది.

బింబిసార చక్రవర్తి బుద్ధదేవునికీ, భిక్షు భిక్షుకీ గణాలకూ చేసిన పాదపూజ ముగిసిపోగానే పౌరులందరూ తిరిగీ తమ తమ గృహాలకు వెళ్ళిపోయారు.

బుద్ధదేవుడు శిష్యగణంతో కలిసి రాజగృహ మహావిహారానికి మరలి పోయాడు. ఇక చక్రవర్తి ఒక్కడే కొందరు పరిచారకులతో కలిసి ఆ ఉద్యానవనంలో విహరిస్తున్నాడు. కొంతసేపటికి తోటమాలిని తన సన్నిధికి తీసుకురావలసిందని ఆజ్ఞాపించాడు. అత డక్కడికి

వచ్చాడు. కాని, ఎక్కడా చెక్కు చెదరలేదు! 'చక్రవర్తిని ప్రాణ భిక్ష పెట్టవలసిందని ప్రార్థించవయ్యా!' అని భార్య అతనికి శతవిధాలుగా చెప్పి చూచింది. తోటమాలి ఇంతకుపూర్వమైతే దీనికి కొంచెం మెత్తబడేవాడేమో! కాని, చక్రవర్తే స్వయంగా బుద్ధదేవునికి పాదపూజ చేసిన తరువాత తానిక ప్రాధేయపడవలసిన అవసరమేమీ లేదనీ, తన ప్రాణాలు పోయినాసరే అన్నిటికీ సిద్ధమేననీ అన్నాడు.

తోటమాలి చక్రవర్తి సన్నిధికి వెళ్ళగానే బింబిసారు డతనిమీద విరుచుకుపడ్డాడు. కాని, తోటమాలి దానికేమీ చలించలేదు! తప్పిదం మన్నించవలసిందని కూడా వేడుకోలేదు! అందరూ తోటమాలికిక శిరశ్ఛేదనమో, నగర నిర్వాసనమో తప్పదని నిశ్చయించారు. దూర దూరంగా నిలుచున్న తోటమాలి భార్య భర్త మూర్ఖత్వాని కనేక విధాలుగా వాపోయింది. అటు పిమ్మట చక్రవర్తి కళ్ళెర్రజేసి తోటమాలికేసి చూచి, వెంటనే స్వీయ భవనానికి వెళ్ళిపోయాడు. ఆ మరునాడు తోటమాలి కిక శిరశ్ఛేదం జరగక తప్పదని అక్కడి వారందరూ నిశ్చయించారు.

కాని, ఆ మరునాటి ఉదయం తోటమాలి, అతని భార్య 'తాము విన్నది నిజమేనా?' అని ఎంతైనా ఆశ్చర్యపోయారు!

తోటమాలికి రాజగృహనగరోద్యానాలన్నిటిమీదా ఆధిపత్యం వచ్చింది! రాజదూత స్వయంగా ఆ చక్రవర్తి శాసనం చదివి వినిపించాడు.

చక్రవర్తి తోటమాలి చేసిన పూజలకై ఇంకా ఎనిమిదేసి మత్తగజాలు, ఉత్తమాశ్వాలు, ఎనిమిది కుంచాల సువర్ణ దీనారాలు కూడా బహూకరించాడు. ప్రత్యేకంగా అతని పరిచర్యకై ఎనమండుగురు పరిచారికలను కూడా ప్రసాదించాడు.

తోటమాలి భార్య ఈ మహాదృష్ట వర్షాని కెంతైనా ఆనందించింది గాని, "అయ్యో! నీలాంటి వెర్రినాగమ్మకు దాసీపిల్లలు కూడానా? నేను చాలనా!" అని ఆ దీపనిగా విరగబడి నవ్వింది!